


# అపరిచితుడు

- మక్కేశ్వర్

బీజింగ్.. ఒలింపిక్స్ సంబరాలు ముగిశాయి. భారతదేశం ఒక స్వర్ణం, రెండు కాంస్యపతకాలతో అట్టడుగు స్థానంలో నిలబడింది. క్రితంసారి అవీ లేవు. అంతకుముందు మల్లీశ్వరి పుణ్యమా అని ఒక కంచుమోత మ్రోగింది. చిన్నచిన్న దేశాలు సైతం పై స్థానాల్లో నిలబడ్డాయి. కన్నీళ్లొచ్చాయి. ఏదో ఒకటి చెయ్యాలి. కనీసం 2012 లండన్ ఒలింపిక్స్ కైనా మన కుర్రాళ్లను ఉత్సాహపరచాలి, ప్రోత్సహించాలి. సత్తా చూపించేలా చెయ్యాలి. మన కుర్రాళ్లకి ఒక ఉత్ప్రేరకంగా పని చెయ్యాలి. కసి పెరిగింది. రాత్రి పది నిద్ర కుపక్రమించాను. మంచం మీద పడుకున్నాను. మాగన్నుగా నిద్రపడుతోంది. ఆ మగత నిద్ర నాలో ఉన్న అపరిచితుడు లేచాడు. ఒళ్లు విరుచుకున్నాడు.

న్యూ యార్క్, మాడిసన్ స్క్వేర్. సమయం సాయంత్రం ఆరు. భారతీయకాలమానం ప్రకారం తెల్లవారు జామున నాలుగు.

ఇండోర్ స్టేడియం కిటకిటలాడుతోంది. పద్దెనిమిది వేలమంది సీట్లలో కూర్చొనున్నారు. పరోక్షంగా కోట్లమంది ప్రపంచవ్యాప్తంగా టీవీల ముందు కూర్చున్నారు. ఎలక్ట్రానిక్ బోర్డు మీద పేర్లు కనిపిస్తున్నాయి. మైక్ టైసన్ వర్సెస్ మక్కేశ్వర్ (ఇండియా) నేను డ్రెస్సింగు రూములో కూర్చున్నాను. టైమైంది.

ప్రపంచ హెవీ వెయిట్ (WBC) బాక్సింగ్ పోటీలు. డిపెండింగ్ చాంపియన్ టైసన్. చాలెంజర్ని నేనే. భారత్‌లో కోట్లమంది సీట్ల కతుక్కుపోయారు. ఉత్కంఠ, పైపందాలు (బెట్టింగు) జోరుగా జరుగుతున్నాయి.

నేను ఎరీనా మీద కొచ్చాను. రిఫరీవచ్చి ప్రత్యర్థిని పరిచయం చేశాడు. ఇద్దరం ఒకళ్లనొకళ్లు చూసుకున్నాం. చేతులు కలుపుకున్నాం.

బహుశా కెరీర్లో ఇదే మొదటిసారేమో, నా పర్సనాలిటీ చూసి టైసన్ కాస్త తడబడ్డాడు.

నేను ఆరడుగుల ఐదంగుళాలు పొడవు. కమ్మెచ్చులు తీసినట్లు ఛాతీ. భుజాలంటారా, ఫిరంగి గుళ్లలా ఉంటాయి. టైసన్ తడ బాటుకి కారణాలు ఇవే! నాది మట్టుకు ఒక్కటే లక్ష్యం. ప్రత్యర్థి చెవులు కొరికే వీడి చెవులూడిపడేలా చితగ్గొట్టాలనుకున్నాను.

బెల్ మోగింది. బాక్స్ అంటూ రిఫరీ పక్కకి తప్పుకున్నాడు. అంతే! ఒకే ఒక పిడిగుద్దు ముక్కు మీద గుద్దాను. పడిపోయాడు. రక్తం కారిపోతోంది. దిమ్మ తిరిగిపోయింది. పట్టపగలే చుక్కలు కనిపించాయి.

కౌంట్ డౌను మొదలయింది. వన్, టూ, త్రీ, ఫోర్, నైన్ అన్నప్పుడు తూలుకుంటూ లేచాడు. ఆలస్యం చేయకుండా ఒక లెఫ్ట్ హుక్, ఒక రైట్ హుక్ ఇచ్చి, ఒక అప్పర్ కట్ కొట్టాను. మళ్లీ పడిపోయాడు. స్టేడియం అంతా గోలగోల! భారతీయుల హడావిడి ఇంతా అంతా కాదు. జాతీయజండాలు ఊపుతున్నారు. "మారో, మారో, కొట్టో, అడి, అడి!" అని అన్ని భాషల్లోనూ అరుస్తున్నారు.

రౌండు అయిపోయినట్టుగా బెల్ మోగింది. ఎవరి స్థానాల్లో వాళ్లు కూర్చున్నాం. టైసన్ ట్రెయినీ వచ్చి ముక్కు తుడిచి, ఐస్ ముక్క పెట్టాడు. నీళ్లు పట్టాడు. ధైర్యం చెపుతున్నాడు. బెల్ మోగింది.

క్షణం ఆలస్యం చేయకుండా ఎదురుదాడి చేసి, ఫైవ్ పంచ్ కాంబినేషన్‌తో ముక్తాయింపిచ్చాను. పడిపోయాడు. మరి లేవలేదు. ఎవరో ఇద్దరు స్ట్రెచర్ మోసుకొచ్చి, దాని మీద పడేసి, తీసుకుపోయారు.

రిఫరీ వచ్చాడు. జాన్నెడు వెడల్పుంది చాలా బరువుంది. దానికి కాస్త బంగారం, కాసిని వజ్రాలు పొదిగారు. హెవీ వెయిట్

బెల్టులు. వాటిని నా భుజం మీద వేశాడు. నా చేయి పైకెత్తి 'ఇతనే చాంపియన్' అన్నాడు. కళ్లు జిగేల్‌మనేలాగ వందల ఫ్లాష్‌లు వెలిగాయి. స్టేడియంలో ఉన్న భారతీయులంతా పరిగెత్తు కొచ్చారు. ఆకాశాని కెత్తేశారు.

సెకండు రౌండ్లోనే ఔటు అయిపోయిందన్నారు. అది గూడా నా కౌటన్నారు. క్రమం తప్పకుండా ముద్దపప్పు, నెయ్యి తిన్నవాణ్ని మరి! ఆంధ్రులు, తమిళులు, మలయాళీలు, గుజరాతీలు, బెంగాలీలు, ఇండియన్సంతా చుట్టుముట్టేశారు. ఆటోగ్రాఫులన్నారు, ఓ పదిమంది దాకా. సంతకాలు పెట్టాను. మా ఇంటికి డిన్నరుకి రండన్నారు. సున్నితంగా తిరస్కరించాను.

ఓ పెద్ద చెక్కిచ్చారు. దాన్లో ప్రయిజ్ మనీ పది కోట్లుకుంది. టైసన్‌కి గూడా ఓ రెండు కోట్లిచ్చారు.

ఆ రాత్రి ఇండియన్ ఎంబసీ వాళ్లు డిన్నరుకి ఆహ్వానించారు. భోజనం చేశాను. ఎంబసీలో పని చేసే ఒక నీగ్రో అతను పరిచయ మయ్యాడు. అతన్ని 'హార్లే డేవిడ్ సన్ దొరుకుతుందా?' అనడిగాను. దొరుకుతుందన్నాడు. ఆ రాత్రంతా అదేసుకొని న్యూ యార్క్ నగరవీధులన్నీ తిరిగాను. చిన్నప్పటి నుంచి హార్లే డేవిడ్ సన్ తోలాలని కోరికుండేది. తెల్లవారు జామున దాన్నక్కడ పారేసి లండన్ ఫ్లైట్ క్యాచ్ చేశాను.

000

లండన్, సెంట్రల్ కోర్టు, వింబుల్డన్. ఉదయం తొమ్మిదవ వస్తుంది. మరి కాసేపట్లో ఫైనల్స్ మొదలవుతాయి.

హేమాహేమీలు పాల్గొన్న వింబుల్డన్‌లో బాలారిష్టాలన్నీ దాటి ఫైనలు చేరాను. ప్రత్యర్థి అమెరికన్. అతను ఇప్పటికే ఆరుసార్లు కప్పు గెలుచుకున్నాడట. ఏడోసారి గూడా గెలవాలని, ఉవ్విళ్లూరుతున్నాడు. అలా జరిగితే, ఏదో రికార్డు సమం చేసినవాడౌతాడట.

నాకిదే మొదటి సారి. పైగా వైల్డ్ కార్డ్ ఎంట్రీ అన్ సీడెడ్ ఆటగాణ్ని. స్టేడియంలో సగానికి పైగా భారతీయులే. అన్ని రాష్ట్రాలవారూ ఉన్నారు. టైమైంది.

ఇద్దరం రాకెట్లేసుకుని కోర్టులో కొచ్చాం. అమెరికావాడు నన్ను చాలా చులకనగా ఆఫ్టాల్ బచ్చాగాడివన్నట్టు చూశాడు. సర్లే అనుకున్నాను.

ఏ పనికైనా ముందు వినాయకుణ్ని తలచుకోమని బామ్మ చెప్పింది. శుక్లాంబరధరం చదువుకున్నాను. నా ఇష్టదేవం ఆంజనేయస్వామిని స్మరించుకున్నాను. మ్యాచ్ మొదలైంది.

అమెరికావాడు గంటకు నూట ఎనభై కిలో మీటర్ల స్పీడ్‌తో సర్వ్ చేశాడు. సర్వీస్ బ్రేక్ చేశాను. ఒళ్లు మండింది. వాడి మీద నాలుగాకులు ఎక్కువే సర్వ్ చేశాను. గంటకి 195 కి.మీ. ఇది వింబుల్డన్ చరిత్రలోనే ఫాస్టెస్ట్ సర్వీసని టెన్నిస్ పండితులన్నారట. ఒక దశలో ప్రత్యర్థి రాకెట్ కిందపడిపోయింది.

భారతీయులే కాకుండా పాకిస్తాన్, బంగ్లాదేశ్ లాంటి అసియా దేశస్థులందరూ, నాకే సపోర్ట్ చేస్తున్నారు.

ఏ పనికైనా ముందు వినాయకుణ్ని తలచుకోమని బామ్మ చెప్పింది. శుక్లాంబరధరం చదువుకున్నాను. నా ఇష్టదేవం ఆంజనేయస్వామిని స్మరించుకున్నాను. మ్యాచ్ మొదలైంది. అమెరికావాడు గంటకు నూట ఎనభై కిలో మీటర్ల స్పీడ్‌తో సర్వ్ చేశాడు. సర్వీస్ బ్రేక్ చేశాను. ఒళ్లు మండింది. వాడి మీద నాలుగాకులు ఎక్కువే సర్వ్ చేశాను. గంటకి 195 కి.మీ. ఇది వింబుల్డన్ చరిత్రలోనే ఫాస్టెస్ట్ సర్వీసని టెన్నిస్ పండితులన్నారట. ఒక దశలో ప్రత్యర్థి రాకెట్ కిందపడిపోయింది. భారతీయులే కాకుండా పాకిస్తాన్, బంగ్లాదేశ్ లాంటి అసియా దేశస్థులందరూ, నాకే సపోర్ట్ చేస్తున్నారు.

"మక్కీ, మక్కీ, గో ఆన్, గో ఆన్!" అనరుస్తున్నారు. మొదటి సెట్టు గెల్చుకున్నాను. స్టేడియం అంతా కోలాహలం ఇండియన్స్ అయితే నానాగోలా చేసేస్తున్నారు, అరుపులు... కేకలు... ఈలలు...!

రెండో సెట్టు మొదలయ్యింది. నువ్వా, నేనా అన్నట్లు సాగింది. అమెరికావాడు రెచ్చిపోయాడు. సహనం కోల్పోయాడు. దాంతో చాలా ఫౌల్స్ చేశాడు. నేను మాత్రం సహనం కోల్పోకుండా జాగ్రత్తగా ఆడాను.

పదకొండు ఏస్‌లు సంధించాను. వోలీలు వేశాను. రెండో సెట్టు గూడా గెల్చుకున్నాను.

పీ బ్రేక్. కాసిని ఐస్ వాటర్ తాగాను. నా కోచైతే ఉబ్బితబ్బిబ్బయి పోతున్నాడు. 'జాగ్రత్త. ఈ సెట్‌తో కానిచ్చేయ్!' అన్నాడు. అలాగే అన్నాను.

మూడో సెట్లో మరో నాలుగు ఏస్‌లు సంధించాను. కోర్టంతా పరుగులు తీయించాను. చెమలు కక్కేశాడు. అంతా అయి పోయింది. మ్యాచ్ ముగిసింది. నెట్ దగ్గరకొచ్చి ప్రత్యర్థితో షేక్ హ్యాండ్ తీసుకొని వచ్చి కూర్చున్నాను.

ఇండియన్సంతా లోపలికి గెంతేశారు. చుట్టుముట్టేశారు. మువ్వన్నెల జండాలు అంతటా ఎగిరాయి. సిక్కులతే బల్లే, బల్లే డాన్సులు చేశారు. అంతా కోలాహలం...!

అతి పిన్నవయసులో టైటిల్ గెల్చుకున్న వ్యక్తిగా రికార్డుకెక్కావన్నారు. గతంలో 27 పదిహేడేళ్ల జర్మన్ కుర్రాడి పేరు మీదున్న రికార్డు బద్దలైందన్నారు. ఇది గిన్నిస్ బుక్‌లో కెక్కుతుందన్నారు.

"తప్పుకోండి, తప్పుకోండి, రాణిగారొస్తున్నా"రన్నారు. రాణిగారొచ్చారు. వెనకాల ప్రిన్స్ చార్లెస్. ఆయన రెండో భార్య కెమిల్లా పార్కర్ బ్రౌన్ గూడా ఉన్నారు. మొదటి భార్య డయానా కొడుకు లిద్దరూ లేరు. వాళ్లు రాయల్ ఎయిర్ ఫోర్స్‌లో ఏదో ట్రెయినింగులో ఉన్నారుట. అంచాత రాలేదట.

షేక్ హ్యాండ్ల వల్ల చర్మరోగాలు తగులుకుంటాయేమోనని రాణి గారు గ్లోవ్స్ వేసుకున్నారు. నాకు కప్పు అందించారు. రెండు, మూడు ప్రశ్నలేవో అడిగారు. సమాధానాలు చెప్పాను.

ఈ వేళ రాత్రి బకింగ్ హామ్ ప్యాలస్‌లో వింబుల్డన్ విందన్నారు. రన్నరప్ అమెరికా వాడికి ఒక పెద్దపళ్లెం లాంటిదిచ్చారు.

ఓ పెద్ద చెక్కు. దాని మీద 10 మిలియన్ పౌండ్లు అనుంది. అది నాకిచ్చారు. రన్నరప్‌కు కూడా కాస్త డబ్బిచ్చారు. ఈ డబ్బంతా ఏం చేసుకోవాలా అని కాసేపు ఆలోచించాను. బామ్మకి కాసిని డబ్బు లివ్వాలనుకున్నాను.

కాకినాడ వెళ్లాక పాత శివాలయంలో శివుడికి అభిషేకం, అమ్మవారికి కుంకంపూజ చేయించుకోవాలనుకున్నాను. పాత

సీతా రామస్వామి కోవిల్లో గోత్రనామాల్తో పూజ గూడ చేయించుకోవా లనుకున్నాను.

ఇండియన్సంతా మూగేశారు. మళ్లీ మామూలే. మా ఇంటికి రండంటే మా ఇంటికి రండన్నారు. కుదర్దన్నాను.

మీడియావాళ్లు ఊపిరాడనివ్వడం లేదు. కొందరు నానా ప్రశ్నలూ వేస్తున్నారు.

"మీకు నచ్చిన సబ్బేది? మీరే టూత్ పేస్టు వాడతారు? ఏ హెయిరాయిల్ వాడతారు? మీకు నచ్చిన ఆహారం ఏది? నచ్చిన టూరిస్టు స్పాట్ ఏది? మీకు ఏ సెంటు ఇష్టం?" అబ్బబ్బ, చిరాకేసింది.

మొత్తానికి బయటపడ్డాను.

రాత్రికి బకింగ్‌హామ్ ప్యాలెస్‌లో విందైన తర్వాత నిద్ర పోయాను. మర్నాడు మట్టుకు లండన్లో చూడవలసిన ప్రదేశాలన్నీ చూశాను. థేమ్స్ నది, బిగ్‌బెన్, వెస్ట్ మినిస్టర్ అబ్బే... అన్నీ చూశాను సాయంత్రం కాసేపు కాలక్షేపానికి మౌస్ ట్రాప్ నాటకం చూశాను. ఇక లండన్ అయిపోయినట్టే. ఎయిర్ ఇండియా విమానంలో పాకిస్థాన్ కొచ్చాను.

000

లాహోర్, గడాఫీ స్టేడియం. ఉదయం తొమ్మిదవ వస్తున్నది. ఇండియా, పాకిస్థాన్ పరస్పరం కత్తులు దూసుకుంటున్నాయి. నేను డ్రెసింగ్ రూములో ఉన్నాను. మా కెప్టెన్ టాస్ కోసం వెళ్లాడు. కెపాసిటీ మించి స్టేడియం కిటకిటలాడుతోంది.

టాస్ గెలిచిన కెప్టెన్ ముందుగా బ్యాటింగ్ ఎంచుకొని డ్రెసింగ్ రూమ్‌లో కొచ్చాడు. సరాసరి నా దగ్గరకొచ్చి నువ్వు ఇన్నింగ్స్ ఓపెన్ చెయ్యాలన్నాడు. నేను కంగారుపడ్డాను. "అదేమిటి నేను త్రీ డౌన్ గదా!" అన్నాను.

"ఏం చేస్తాం. ఆ సెలక్షన్ కమిటీ నిర్వాకంతో మనకు సరైన ఓపెనర్ లేడు. నువ్వే చెయ్యా"లన్నాడు. ఏం చేస్తాం, సరేనన్నాను.

శుక్లాంబరధరం చదువుకొని, ఆంజనేయస్వామికి దండం పెట్టుకొని ప్యాడ్‌లు కట్టుకున్నాను. నాకు జతగా బోనీ వచ్చాడు. పాకిస్థానీల అరుపులు, అవహేళనల మధ్య మ్యాచ్ మొదలయింది.

సీమరొచ్చాడు. అతనేదో ఊరికి ఎక్స్‌ప్రెస్ అట. ఫాస్ట్ బౌలరట. వంద గజాల దూరం నుంచి పరిగెత్తుకొచ్చి బంతి విసిరాడు.

జై పరమేశ్వరా అని లాగి కొట్టాను. సిక్సర్‌కెళ్లిపోయింది. బౌలరు గతుక్కుమన్నాడు. స్టేడియం అంతా హాహా కారాలు. రెండో బంతికి మరో సిక్సు. ఆ తర్వాత మూడు, నాలుగు, అయిదు, ఆరు అన్నీ సిక్సులే! బౌలరు పళ్లు నూరుతున్నాడు. ఓవరైపోయింది. రెండో బౌలరు స్పిన్నరట. స్పిన్ మాయాజాలంతో గతంలో రెండొంద ల్దాకా వికెట్లు తీశాడట. చూస్కో నా తడాఖా అన్నట్టు చూశాడు. బౌలింగు మొదలైంది. లెగ్ స్పిన్, ఆఫ్ స్పిన్, ఇన్ స్వింగర్లు, గూగ్లీలు, యాంకర్లు అన్నీ విసిరాడు. నమ్మండి, నమ్మకపోండి, ఆరు బాల్స్ ఆరు సిక్సులు కొట్టాను. ప్రేక్షకులు గోలగోల! ఇండియన్స్ అయితే టపాకాయలు కాల్చారు. స్టేడియం అంతా మువ్వన్నెల జెండాలే!

ఫాస్ట్ బౌలరు, స్పిన్నరు ఏదో మాట్లాడుకున్నారు. మళ్లీ ఫాస్ట్ బౌలరొచ్చాడు.స్లెడ్జింగు మొదలెట్టారు. బూతులు గూడా తిడుతున్నారు. నేనేవీ పట్టించుకోలేదు. అర్జునుడికి పక్షి కన్నులాగ నాకు బంతే కనిపిస్తోంది. మూడో ఓవర్లో గూడా ఆరు సిక్సులు వాయించాను. సెంచరీ పూర్తయింది. డ్రింక్సు టైమైంది. ఇండియన్ టీం వాళ్లందరూ నన్ను ఆకాశానికెత్తేశారు.

వరుసగా పద్దెనిమిది సిక్సులు ఒక రికార్డన్నారు అతి తక్కువ సమయంలో అర్ధ సెంచరీ, అతి తక్కువ సమయంలో సెంచరీ గూడా రికార్డేనన్నారు. ఒక వెస్టిండీసు వాణ్ని, ఒక శ్రీలంక వాణ్ని, వెనక్కి నెట్టేశావన్నారు. సర్లే అనుకున్నాను.

మళ్లీ ఆట మొదలయ్యింది. లంచ్ టైముకల్లా రెండొందల యాభై కొట్టిపారేశాను. పాపం, నా సహ బ్యాట్స్‌మాన్ బోనీకి బ్యాటింగు చేసే అవకాశమే రాలేదు.

మధ్యాహ్నం మరో నూట యాభై రన్స్ చేశాను. అందులో ఓ పది మట్టుకు ఫోర్లు, మిగతావన్నీ సిక్సులే! కెప్టెన్ వచ్చి మ్యాచ్ డిక్లేర్ చేశాడు.

000

సాయంత్రం ఆరయ్యింది. లాహోర్ యూనివర్సిటీ సెంట్రల్ హాల్. ఓ, ఓ, జనం. ఆడపిల్లలు చాలామందొచ్చారు. ఇండియన్స్ పాకిస్థానీయులతో హాలంతా కిటకిటలాడిపోయింది.

మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అన్నారు కొందరు. అబ్బెబ్బే, మ్యాన్ ఆఫ్ ద సీరీస్ ఇచ్చేయాల్సిందే అని కొందరు వాదించారు. సరేనని నిర్ణయించారు.

కొంత రొఖ్ఖం ఇచ్చారు. ఓ జ్ఞాపిక ఇచ్చారు. బోల్డన్ని డబ్బులొచ్చి పడ్డాయి. బామ్మకి మరో కాసిని డబ్బులివ్వాలనుకొన్నాను. డబ్బు లావాదేవీలు చూడ్డానికి గుర్నాథాన్ని వేసుకోవాలనుకున్నాను.

గుర్నాథం కోమట్లు. యాభై ఏళ్లుంటాయి. నిక్కచ్చి మనిషి. చాలా కాలంగా కాకినాడలో కిరాణా కొట్లలో పద్దులు రాస్తూ ఉంటాడు. చిట్టా, ఆవర్జాలు మెయింటెయిన్ చేయడంలో మంచి అనుభవశాలి. కాబట్టి డబ్బు వ్యవహారాలు చూడ్డానికి అతన్ని వేసుకోవాలను కున్నాను.

ఇండియా, పాకిస్థాన్‌లలో అన్ని పేపర్లలో ఫోటోలతో సహా హెడ్ లైన్స్ వేసేశారు. మరో గవాస్కరన్నారు. బ్రాడ్‌మన్ మళ్లీ పుట్టాడ న్నారు. నేను పొంగిపోలేదు. స్థితప్రజ్ఞత పాటించాను.

ఇంగ్లండ్‌లో అయితే అప్పుడే తర్జనభర్జనలు పడుతున్నారట. ఈ ఏడాది సీజన్‌లో ఆ కుర్రాణ్ని, కౌంటీస్‌లో ఆడించాలనుకుంటు న్నారట. తలలు పండిన క్రికెట్ పండితులంతా నా ఆటను విశ్లేషిస్తున్నారట.

ఆస్ట్రేలియన్‌లైతే నా గురించి వాడిగా వేడిగా చర్చించుకుంటు న్నారట. వచ్చే ఏడాది మెల్ బోర్న్‌లో జరగబోయే వరల్డు కప్‌లో నా ఆట చూడాలని తహతహలాడుతున్నార్ట.

ముంబయిలో బాలీవుడ్ నిర్మాతలు కొందరు, నన్ను పెట్టి సినిమా తీయాలనుకుంటున్నారని ఒక గాలి వార్త కూడా వచ్చింది. అలా జరిగిన పక్షంలో బ్లాంక్ చెక్ డిమాండ్ చెయ్యాలని అనుకున్నాను.

కొందరు బాలీవుడ్ నటీమణులు, కొంతమంది టాప్ మోడల్స్ నేను ఇండియా ఎప్పుడొస్తానా అని చూస్తున్నట్టుగా కూడా మరో గాలి కబురొచ్చింది.

అయితే నాకిప్పట్లో ఇండియా వెళ్లే ఆలోచన లేదు. మరో ధ్యాన్ చంద్‌గా మారిపోయి, వచ్చే ఒలింపిక్స్‌లో హాకీలో ఓ ఇరవై గోల్స్ వేసేసి, హాకీకి పూర్వవైభవం తేవాలనే తలంపులో ఉన్నాను.

వీపు చెళ్లుమనడంతో తుళ్లిపడి లేచాను. "ఏవిరా! ఏడవుతుంటే ఇంకా దున్నపోతులా పడుకున్నావా? ఇవాళ్టికింక లేవవా?" అన్నయ్య అరుస్తున్నాడు. మత్తు వదల్లేదు. కళ్లు నులుపుకున్నాను. ఆ హెవీ వెయిట్ బెల్టులు, ఆ వింబుల్డన్ కప్పు, మ్యాన్ ఆఫ్ ద సీరీస్ అవార్డూ ఏవయ్యాయా అన్జూశాను. బామ్మగాని తీసి దాచిందా? లేకపోతే అన్నయ్యగాని బైట పారేశాడా? అనుకున్నాను.మత్తు వదిలింది. నెమ్మదిగా సబ్‌కాన్షస్ లోంచి కాన్షస్‌లో కొచ్చాను. అప్పుడర్థమైంది ఇదంతా కలని! అపరిచితుడు మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు.

*(అంకితం: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంగారికి.)*